శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు రండి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఆహ్వానం

ఎమ్మెల్యే పల్లాకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ప్రతినిధులు

జనగామ, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక జనగామ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి మూడురోజులపాటు నిర్వహించే శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆ సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఆహ్వానించారు. ఈనెల 30న జనగామ పట్టణం, సెప్టెంబర్ 3న బచ్చన్నపేట మండల కేంద్రం, సెప్టెంబర్ 1న రామచంద్రాపురంలో జరిగే వేడుకల ఆహ్వానపత్రికను అందించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక జనగామ కమిటీ అధ్యక్షుడు శ్రీనాథ్ శ్రేష్టి సభ్యులు, కొన్నె ఉపేందర్, అశోక్ పాల్గొన్నారు.

26న బాలభారతి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

ఈనెల 26న సోమవారం ఉదయం 10.30 గంటలకు బాలభారతి ఆధ్వర్యంలో ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు త్రిపురారి సూర్యప్రసాద్ పద్మ తెలిపారు. ఒకటి నుంచి ఐదో తరగతి పిల్లలకు వేషధారణ, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు డాన్స్ (కృష్ణుడికి సంబంధించినవి) నిర్వహిస్తామని పేర్కొన్నారు. విజేతలకు బాలభారతి ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 24న శనివారం ఉదయం 11గంటల లోగా వాట్సాప్ నంబర్ 9652408848కు వివరాలు, పోటీ అంశాన్ని నమోదు చేసుకోవాలని కోరారు.

కేజీబీవీలో కరపత్రం ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు రవి

నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

పాలకుర్తి, ఆగస్టు 23: కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకుడు కొత్తపల్లి రవి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో కేజీబీవీలో నాన్ టీచింగ్ సిబ్బందితో చలో హైదరాబాద్ కరపత్రం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం కేజీబీవీల్లో బోధన సిబ్బంది వయస్సు 65 పెంచాలని, రిటైరైన వాళ్లకు రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెలకు రూ.18వేలు చెల్లించడంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ నెల 30న చలో ఎస్‌పీడీ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలన్నారు. తొర్రూర్ ఏరియా కమిటీ కార్యదర్శి ఎండీ షరీఫ్, పద్మ, సుమలత, లక్ష్మీ, లత పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

'నమస్తే' ఎఫెక్ట్

పాలకుర్తి రూరల్, ఆగస్టు 23: మండలంలోని శాతాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కే ఉషారాణి విధులపై నిర్లక్ష్యం వహించడంతో సస్పెన్షన్ చేసినట్లు మండల నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య తెలిపారు. 'సమయ పాలన పాటించని ఉపాధ్యాయులు' శీర్షికన ఈనెల 14వ తేదీన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనంపై స్పందించిన కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ డీఈవో కే రామునాయక్‌ను విచారణకు ఆదేశించారు. ఉపాధ్యాయురాలు విధులపై నిర్లక్ష్యం వహించినట్లు తేలడంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

కొత్త ఆర్‌ఓఆర్ చట్టంపై భిన్నాభిప్రాయాలు

కలెక్టరేట్ చర్చా వేదికలో వివిధ వర్గాల ప్రతినిధులు

జనగామ, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణ హక్కుల రికార్డు చట్టం (ఆర్‌ఓఆర్ యాక్ట్–2024) ముసాయిదాపై శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన చర్చా వేదికలో వివిధ వర్గాల ప్రతినిధుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ అధ్యక్షత వహించగా ఆర్డీఓలు కొముర య్య, వెంకన్న పాల్గొని నూతన ఆర్‌ఓఆర్ చట్టం–2024 ముసాయిదా వివరాలు వెల్లడించారు. స్టేషన్‌ఘనపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేశ్, సామాజిక కార్యకర్త, కిష్టయ్య మాట్లాడుతూ భూముల సర్వే పూర్తి చేశాకే భూదార్ ఇవ్వాలన్నారు. మ్యుటేషన్స్ పాత సర్వే నంబర్‌లోనే ఇవ్వాలని, ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించాలన్నారు. సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది, సాదిక్ అలీ మాట్లాడుతూ భూముల వివరాలను ఆన్‌లైన్ కాకుండా పేపర్‌పై రాసి ఇవ్వాలని, జమాబందీ కావాలని, ఎంతో కొంత భూమి శిస్తు పెట్టాలన్నారు. అప్పీలుకు 90 రోజుల సమయం కేటాయించాలని, రెవెన్యూ కోర్టులు కాకుండా

ముసాయిదాపై చర్చా వేదికలో మాట్లాడుతున్న ప్రతినిధులు

జ్యుడీషియరీ కోర్టులు రావాలని, మూడు నెలల్లో 4 పేషీల్లో భూముల కేసులను ముగించాలని అభిప్రాయపడ్డారు. బచ్చన్నపేట మండలం తమ్మడపల్లికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయాల్లో సరిపడా సిబ్బంది ఉండాలని, ఫీల్డ్ సర్వే చేయకుండా హద్దులు నిర్వహించొద్దని, అసలు భూమి ఎంత ఉందని స్పష్టంగా రాయాలని, పహానీలు కొనసాగాలని సూచించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఆర్‌ఓఆర్–2024 చట్టం రూపకల్పనలో ప్రజలు, రైతులు, ఇతర అన్ని వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. జనగామ ఆర్డీఓ కొముర య్య మాట్లాడుతూ భూముల రికార్డింగ్ అథారిటీ తహసీల్దార్లకు ఇవ్వాలని అప్పీల్ అధికారాలు ఆర్డీఓలకు, రీఅప్పీల్ అధికారాలు కలెక్టర్‌కు ఇవ్వాలని, ఆపైన సివిల్ కోర్టును ఆశ్రయించేలా ఉండాలని అన్నారు. స్టేషన్‌ఘనపూర్ ఆర్డీఓ వెంకన్న మాట్లాడుతూ వేగంగా, సులభరీతిలో అయ్యేలా కొత్త ఆర్‌ఓఆర్ చట్టాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపారు. తరిగొప్పుల తహసీల్దార్ చారి మాట్లాడుతూ పహాణీలు కచ్చితంగా ప్రింట్ అవుట్ తీసుకొని పెట్టుకోవాలని, మ్యుటేషన్, సక్సెషన్ కేసులకు ఎలాంటి వసూళ్లు చేయకుండా నమోదు చేయాలన్నారు. చట్టం ద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణ చేయాలని, వివిధ మ్యుటేషన్లలో వేరుగా పడిన భూమిని విభజించాలని, మండలాల వారీ గా రెవెన్యూ అధికారులు, సర్వేయర్లను, నియమించాలని మరికొందరు సూచన చేశారు.

బతుకుదెరువు కోసం వెళ్లి..

శవమై వచ్చి..

ముంబైలో నష్కల్ యువకుడి మృతి

వినయ్‌కుమార్

చిల్పూరు, ఆగస్టు 23 : బతుకుదెరువు కోసం వెళ్లిన ఓ యువకుడు విగతజీవిగా ఇంటికి చేరాడు. ఎన్నో ఆశలతో ఉన్న ఊరిని విడిచి వెళ్లి ఇలా శవమై రావడం ఆ ఇంట తీవ్ర విషాదం నింపింది. అతడి తల్లిదండ్రులు వడ్లకొండ శంకర్–మణెమ్మ తెలిపిన వివరాల ప్రకారం..

చిల్పూరు మండలం నష్కల్ గ్రామానికి చెందిన వడ్లకొండ వినయ్‌కుమార్(30) ఉపాధి కోసం ఏడాది క్రితం తన స్నేహితులతో కలిసి ముంబై వెళ్లాడు. ఏం జరిగిందో ఏమోగాని గురువారం తెల్లవారుజామున అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా ఒక్కగానొక్క కొడుకు దూరమవడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదంలో నెలకొంది. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని నష్కల్ గ్రామానికి తీసుకొచ్చి ఖననం చేశారు.

సన్మానిస్తున్న ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

ఉద్యోగ విరమణ సైనికులకు సన్మానం

జనగామ, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగ విరమణ పొందిన సైనికులను పారా మిలటరీ ఎంప్లాయీస్ సొసైటీ జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు డేగల సంపత్ ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ పొందిన సైనికులు ఎం.ప్రకాశ్, పి.కిరణ్ కుమార్ సేవలను కొనియాడారు. పీఎంఈఎస్ ప్రధాన కార్యదర్శి ఉడుత మహేందర్, దేవరుప్పుల మండల అధ్యక్షుడు అజ్మీరా రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు వేల్పుల కిరణ్‌కుమార్, నీరటి సుధాకర్, స్టేషన్‌ఘనపూర్ మండల సభ్యులు గండ్ల అనిల్, రఘునాథపల్లి మండల సభ్యులు ఉడుత నాగరాజు పాల్గొన్నారు.

నేడు బీఎల్‌ఓలకు శిక్షణ

బచ్చన్నపేట, ఆగస్టు 23: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బీఎల్‌ఓలకు ఓటరు జాబితాపై శిక్షణ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఫణికిషోర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో బీఎల్‌ఓలు పాల్గొనాలని సూచించారు.

ఘనంగా కల్యాణోత్సవం

ముత్తయిదువులకు సత్కారం చేస్తున్న కృష్ణచార్య సిద్ధాంతి

జనగామ, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని బాణాపురం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా లక్ష్మీ నారాయణ స్వామి కల్యాణోత్సవం ప్రధానార్చకులు తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్ కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి మార్గదర్శనంలో కనుల పండువగా జరిగింది. పట్టణానికి చెందిన 1008 మంది ముత్తయిదువులు పాల్గొన్నారు. స్వామి ఆలయం పాక్షాన వాయినాలు ఇచ్చి చినజీయర్‌స్వామి పక్షాన ప్రధానార్చకుడు మంగళ శాసనాలతో ఆశీర్వదించారు.

ఘనంగా బోనాల పండుగ

బచ్చన్నపేట, ఆగస్టు 23: మండలంలోని అలీంపూర్‌లో మాతమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ బోనాల పండుగను దళితులు ఘనంగా జరుపుకున్నారు. నెత్తిన బోనాలతో శివసత్తుల పూనకాలు, పోతురాజు విన్యాసలతో వైభంగా ఊరేగింపుగా బయల్దేరారు. అమ్మవారికి బోనాలు నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై విద్యార్థుల నిరసన

దేవరుప్పుల, ఆగస్టు 23: కోల్‌కతాలో ఘటనపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం నిరసన ర్యాలీ తీశారు. ప్రిన్సిపాల్ కొలిపాక భాస్కర్ మాట్లాడుతూ దవాఖానలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యురాలిపై అమానవీయ ఘటన జరగడం దారుణమన్నారు. ఎన్‌ఎస్ఎస్ కోఆర్డినేట్ అరుణాకర్, అధ్యాపకులు చైతన్య, రాధిక, రహీమున్నీసా, హరితకుమారి, భవానీ, సుమ, రవీందర్, శ్రీనివాస్ ఉన్నారు.

దేవరుప్పులలో జీజేసీ విద్యార్థినుల మానహారం

రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్‌లో శిక్షణ

బచ్చన్నపేట, ఆగస్టు 23: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 8, 9 తరగతి విద్యార్థులకు శుక్రవారం రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్‌పై అవగాహన కల్పించారు. పాఠశాలలో విద్యారంగంలో నూతనోదయాన్ని చూపించే లక్ష్యంలో సోహం అకాడమి ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, ఉపాధ్యాయులు, రోబోటిక్స్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గురుకుల పాఠశాలలో తనిఖీలు

జనగామ, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనశాలలో బియ్యం, పప్పులు, నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్టాకును పరిశీలిస్తూ రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సివిల్ సప్లై డీఎం హతీరాం, పౌరసరఫరాల అధికారి సరస్వతి, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సివిల్ సప్లై డీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వంటకాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

వైద్యుడిపై కేసు నమోదు

అనుమతి లేకుండా మందుల విక్రయం

లింగాలఘణపురం, ఆగస్టు 23: అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మందులషాపుపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు దాడి చేసి వైద్యుడిపై కేసు నమోదు చేసిన ఘటన మండలంలోని నవాబుపేటలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన అలకంటి కృష్ణ అనుమతులు లేకుండా క్లినిక్ పేరుతో అలోపతి మందులను విక్రయిస్తున్నాడు. ఈ మేరకు అతడిపై 18సీ డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ 1940 ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసి రూ.25వేల విలువైన 56 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. వాటిని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జనగామకు సమర్పించారు. డాక్టర్ రాజలక్ష్మి, ఏలేటి బాలక్రిష్ణ; అరవింద్, గాయత్రి, నల్లా ఇందిరమ్మ పాల్గొన్నారు.

డెంగీతో యువకుడి మృతి

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 23 : ఓ యువకుడు డెంగీతో గురువారం రాత్రి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కడమంచి కాలేశ్ (31) హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. జ్వరం రావడంతో ఐదు రోజుల క్రితం స్టేషన్ ఘన్‌పూర్‌కు వచ్చి ప్రైవేట్ హాస్పిటల్‌లో పరీక్ష చేయించుకోగా డెంగీ అని తేలింది. చికిత్స పొందినప్పటికీ తగ్గకపోవడంతో రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 23 : ధర్మసాగర్ మండలం ధర్మపురం గ్రామానికి చెందిన బైరపాక శోభ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. సీఐ జి.వేణు తెలిపిన వివరాల ప్రకారం.. మంగపేట మండలం కమలాపురానికి చెందిన డోలి రాజుకుమార్ తన బైక్‌ను అజాగ్రత్తగా నడిపి స్టేషన్ ఘన్‌పూర్ శివారు అన్నపూర్ణ రైస్ మిల్లు వద్ద ధర్మసాగర్ మండలం ధర్మపురానికి చెందిన బైరపాక సుదర్శన్, శోభ దంపతులు నాలుగు రోజుల క్రితం టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన వారిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. మృతురాలి కుమారుడు బైరపాక తరుణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా, శోభ నిమ్స్‌లో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందింది.

పురుగులమందు తాగి ఆత్మహత్య

చిల్పూరు/తరిగొప్పుల, ఆగస్టు 23 : పురుగుల మందు తాగి ఇద్దరు శుక్రవారం వేర్వేరు చోట్ల ఆత్మహత్య చేసుకున్నారు. చిల్పూరు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కృష్ణాజిగూడెంకు చెందిన కుంచాల రాజు(32)కు పదేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కాలేదు. మనస్పర్థలు రాగా మూడేళ్ల క్రితం విడాకులైంది. ఒంటరిగా ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై గురువారం సాయంత్రం పురుగులమందు తాగాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియజేయగా చికిత్స కోసం 108లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. తరిగొప్పుల ఎస్సై అయ్యాల శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాలుబాయ్‌తండాకు చెందిన సుమన్‌నాయక్(30) మూడు నెలల క్రితం వివాహమైంది. కొద్దికాలం తర్వాత భార్య అతడితో ఉండకపోవడంతో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరిగినప్పటికీ భార్య రాలేదు. మనస్తాపానికి గురై శుక్రవారం పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

నాలుగు మట్టి ట్రాక్టర్లు సీజ్

దేవరుప్పుల, ఆగస్టు 23: అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై సృజన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నండగా అనుమతులు లేకుండా కామారెడ్డిగూడెంకు చెందిన సూదగిని శ్రీను, చింత వేంకటేశ్వర్లు, చింత సందీప్, ఎల్లబోయిన రమేశ్ నాలుగు ట్రాక్టర్లలో మొరం తరలిస్తుండగా పట్టుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ హుస్సేన్ ఎదుట హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీగా మహేశ్వరం, కందుకూరు, ముచ్చర్లలో ప్లాట్లు, విల్లాలు, ఇండ్లు అమ్మబడును. న్యూయార్క్, సింగపూర్‌లా శ్రీశైలం హైవే... Cont: 8008091512.

NT-332632

TO-LET

★3 Bed Room Flat in GMR Brindavan, Waddepally, 5th Floor and Car Parking available for Rent. Contact Ph: 9849123115.

NT-331671

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

GNNS - KRISHI VIGYAN KENDRA
JAMMIKUNTA, Dist: KARIMNAGAR (Telangana State)-505122.

Applications are invited to the Vacant Post (1) - **STENOGRAPHER (Grade-III)** under Scheme of Krishi Vigyan Kendra, Jammikunta Dist Karimnagar (NGO) and Position **Co-terminus with the scheme.** For Full details please visit our Website www.kvkkarimnagar.org or sent e- mail to kvkkarimnagar@gmail.com.

Last date of receipt of Applications within 10 days from the date of Advertisement

Sd/- **P. Vijay Gopal Reddy,** General Secretary
GNNS-Krishi Vigyan Kendra, Jammikunta, Dist: Karimnagar (TS)

రైతువేదిక ఎదుట మండల ప్రత్యేక అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొడకండ్లలో బీఆర్ఎస్ ధర్నా

కొడకండ్ల, ఆగస్టు 23: మండల కేంద్రంలోని అమరవీరుల చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. రైతులకు రూ.2లక్షల పూర్తి రుణమాఫీ చేస్తామని సగం మందికి కూడా చేయలేని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పార్టీ కొడకండ్ల మండల అధ్యక్షుడు సిందే రామోజీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలకు అండగా ఉంటామన్నారు. రైతువేదిక వద్ద మండల ప్రత్యేక అధికారికి వినతిపత్రం అందజేశారు. మాజీ ప్రజాప్రతినిధులు పేరం రాము, అభిమాన్ గాంధీనాయక్, దీకొండ వెంకటేశ్వర్‌రావు, ధరావత్ జ్యోతి, సొసైటీ వైస్ చైర్మన్ మేటి సోమరాములు, ఎండీ అసీఫ్, చెంచు రాజిరెడ్డి, బాకీ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదకర విద్యుత్ తీగలను సరిచేయాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రఘునాథపల్లి, ఆగస్టు 23: మండలంలోని మేకలగట్టులో నూతనంగా నిర్మించిన ఆర్అండ్‌బీ బ్రిడ్జిపై విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని సరిచేయాలని మాజీ ఎంపీటీసీ బానోత్ భిక్షపతి నాయక్ కోరారు. ఈ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండలోని తన నివాసంలో గ్రామస్తులతోపాటు కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణంతో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయని, ట్రాక్టర్లు, బస్సులకే తాకు ప్రమాదం ఉందని, వాటిని తగిన ఎత్తులో ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మారుజోడు రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి


మాట్లాడుతున్న డీడబ్ల్యూవో జయంతి

దేవరుప్పుల, ఆగస్టు 23: అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలని జిల్లా సంక్షేమ అధికారి జయంతి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మండలంలోని రెండు సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్ల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలు ఉదయం 9నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచి ఉంచాలని, సెంటర్‌లో 10 మంది పిల్లలకు తగ్గకుండా చూసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు భోజనం చేసేలా చూడాలని, ఆరోగ్యలక్ష్మిపై అవగాహన కల్పించాలన్నారు. రెండు సెక్టార్ల సూపర్‌వైజర్లు శ్రీదేవి, సావిత్రి, దూలమ్మ, మిషన్ శక్తి నుంచి శారద పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

- స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో మరో మూడు సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి
- అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ ప్రస్తుతం ఐదు మండలాల్లో 7సెక్షన్లు మాత్రమే ఉన్నాయని, మండలానికి రెండు చొప్పున పది సెక్షన్లను ఏర్పాటు చేసి మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. నియోజకవర్గంలో 220కేవీ సబ్‌స్టేషన్ ఏర్పా టు చేయాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం మరో మూడు కొత్త సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలన్నారు. సామర్థ్యం గల సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపితే మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. నియోజకవర్గంలో 1,23,175 సర్వీసులు ఉండగా, అందులో వ్యవసాయానికి 40వేలు ఉన్నాయని వివరించారు. ఏటా సుమారు వెయ్యి మంది రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని, అందుకు తగిన ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. డీఈ, ఏఈలు సబ్‌స్టేషన్ పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇళ్లపై హైటెన్షన్ వైర్లను తొలగించే నిధులకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. వనపర్తిలో ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. రఘునాథపల్లి పరిధిలో వ్యవసాయ కనెక్షన్లు అధికంగా ఉన్నాయని, 220 కేవీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ భూముల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలన్నారు. తదుపరి సమీక్ష వరకు అధికారులంతా పూర్తి సమాచారంతో రావాలని, విద్యుత్ ప్రజావాణితో పాటు గ్రామస్థాయి ప్రజావాణి నిర్వహించాలని, ప్రజల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఈ వేణుమాధవ్, జనగామ డీఈ లక్ష్మీనారాయణ, స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ హుస్సేన్‌నాయక్, డీఈలు విజయ్‌కుమార్, గణేశ్, ఎస్ఏవో జయరాజు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనపై ప్రత్యేక దృష్టి పెట్టండి

గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం

జనగామ, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : ఈనెల 29న జిల్లాలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటనపై ప్రత్యేక దృష్టిసారించాలని గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన గవర్నర్ పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్ (స్థానిక సంస్థలు), రోహిత్‌సింగ్ (రెవెన్యూ)తో కలిసి పరిశీలించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వివిధ శాఖలను సందర్శించి, అధికారులు, సిబ్బంది పనితీరు పర్యవేక్షించారు. గవర్నర్ పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాకు చెందిన 20 మంది రచయితలు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర పురస్కార గ్రహీతలతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. రోడ్ల మరమ్మతులు, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, భోజన వసతులు, తాగునీరుకు సంబంధించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.

జనగామ రూరల్: ఓబుల్ కేశ్వాపూర్‌లో పరిశీలిస్తున్న గవర్నర్ కార్యదర్శి వెంకటేశం, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ఓబుల్ కేశ్వాపూర్‌లో పరిశీలన

జనగామ రూరల్: ఈనెల 29న మండలంలోని ఓబుల్ కేశ్వాపూర్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటించనున్నందున ఏర్పాట్లను గవర్నర్ ప్రిన్సిపల్ కార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. గ్రామ పంచాయతీ, వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గల ఆడిటోరియాన్ని పరిశీలించారు. అంతకుముందు జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ సమావేశం నిర్వహించారు. జడ్పీ సీఈవో సరిత, డీఆర్డీవో వసంత, తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీవో ఉప్పుగల్లు సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

పాడి పశువులు, పెరటి కోళ్ల పెంపకంతో లాభాలు

రఘునాథపల్లి, ఆగస్టు 23 : మహిళా సంఘాలు పాడి పశువులు, పెరటి కోళ్ల పెంపకంతో లాభాలు సాధించవచ్చని ఏపీఎం సారయ్య అన్నారు. మహిళా శక్తి కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని కంచనపల్లిలోని ప్రియదర్శిని క్లస్టర్ రైతువేదికలో పాడిపశువులు, పెరటికోళ్ల పెంపకంపై మహిళలకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం సంఘంలో ఉన్న సభ్యులకు ఉచితంగా రెండు రకాల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించిందని పేర్కొన్నారు. పశువైద్యాధికారి అశోక్, సీసీ సంపత్, వీవో అధ్యక్షురాలు లలిత, నిర్మల, వీవోఏలు విజయ, సుజాత, వసంత, రాజేశ్వరి, రాజేశ్వరి, లావణ్య, జ్యోతి, ఐలేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీపీఎం కవిత

పాడిపశువులతో ప్రత్యామ్నాయ ఆదాయం

దేవరుప్పుల: రైతులు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ, కోళ్ల పెంపకంతో ప్రత్యామ్నాయ ఆదాయం కోసం పొందవచ్చని డీపీఎం కవిత అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో మహిళాశక్తి పథకంలో అవగాహన సదస్సు జరిగింది. దేవరుప్పుల క్లస్టర్ పరిధిలోని గొల్లపల్లి, దేవరుప్పుల, ధర్మాపురం గ్రామాలను నుంచి 45 మంది మహిళా రైతులు హాజరుకాగా డీపీఎం మాట్లాడారు. ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్యాధికారి గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ పాడి పశువుల పెంపకంపై వివరించారు. ఏపీఎం వెంకట్‌రెడ్డి, ఎంఎస్ అధ్యక్షురాలు నల్ల ఉమ, కార్యదర్శి శారద, కోశాధికారి కారుపోతుల సంధ్య, సీసీలు గజ్జి వసంత, అంకాల సోమనారాయణ, వీవోఏలు హేమలత, నల్ల ఆండాళు, గంగరాజు, అస్మా, ప్రేమలత పాల్గొన్నారు.